పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

షాద్‌నగర్‌రూరల్, నవంబర్ 27: ఆధ్యాత్మిక కేంద్రాలు దేవాలయాలని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో బుధవారం నిర్వహించిన ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆలయ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ దేవాలయాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, రాజ్, రాధాకృష్ణ, రాజు, మహేశ్, కిరణ్, అంజయ్య, రవి పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులను సవరించండి

అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 27 : ప్రతి బూత్‌కు బీఎల్‌వోలను నియమించి ఓటరు జాబితాలో తప్పులను సవరించే విధంగా కృషిచేయాలని ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహింపట్నం ఆర్డీఓ కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పలుపార్టీల నాయకులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి బూత్‌కు బీఎల్‌ఓలను నియమించి ఓటరు జాబితా, తప్పులను సవరించేందుకు కృషిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు సామెల్, బీజేపీ నాయకులు ప్రతాప్, విజయ్‌కుమార్, బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు జగదీశ్వర్, కాంగ్రెస్ నాయకులు విజయ్‌కుమార్‌తో పటు పలువురు అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

రైల్వే ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని పాడిగించాలి

డివిజనల్ రైల్వే మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ డోలి రవీందర్

కొత్తూరు, నవంబర్ 27: కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని పాడిగించాలని సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే కార్యాలయంలో డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేశ్ విశినోను కొత్తూరు మున్సిపల్ వైజ్ చైర్మన్ డోలి రవీందర్ బుధవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట సుధాకర్, సురేశ్, సత్యనారాయణ, రాజు, ప్రకాశ్‌గౌడ్, శ్రీనివాస్ ఉన్నారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

కొత్తూరు, నవంబర్ 27: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రారంభించిన దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని కొత్తూరు బీఆర్ఎస్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 29న శంషాబాద్‌లో దీక్షా దివస్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి పలువులు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర ముఖ్యనాయకులు హాజరవుతారని వివరించారు. ఈ కార్యక్రమానికి మాజీ ప్రజాప్రతినిధులు, పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, బీఆర్ఎస్ మండల నాయకులు, మాజీ సర్పంచలు కార్యకర్తలు, మహిళలు, యువకులు హాజరు కావాలని కోరారు.

ఈత కల్లు గుడిసెకు నిప్పు

మొయినాబాద్, నవంబర్27: కల్లు గీత కార్మికులు రోడ్డు పక్కన గుడిసె వేసుకుని కల్లు అమ్ముతున్న గుడిసెకు దుండగులు నిప్పు పెట్టిన ఘటన మండల పరిధిలోని పెద్దమంగళారం గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు, కల్లుగీత వృత్తిదారుల సంఘం సభ్యుల వివరాల ప్రకారం మండల పరిధిలోని పెద్ద మంగళారం గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికులు పెద్దమంగళారం-చందానగర్ రోడ్డు పక్కన గుడిసె వేసుకుని కల్లు విక్రయిస్తున్నారు. గుడిసెకు పెట్రోల్ పోసి నిప్పు అంటించారు. పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు చూసి మంటలు ఆర్పివేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

కందుకూరు, నవంబర్ 27 : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని మండల విద్యాధికారి నరసింహ సూచించారు. బుధవారం కందుకూరులో విద్యార్థులకు మండల స్థాయిలో 'పునరుత్పాదక శక్తి వనరులు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నేదునూరు ప్రభుత్వ మాడల్ స్కూల్ విద్యార్థులు చీమల వైష్ణవి(10వ తరగతి), చీమల వర్షిణి(9వ తరగతి), జాపాల వర్షిత(8వ తరగతి) పోటీల్లో గెలుపొందారు.

అల్లుకున్న నిర్లక్ష్యం..

అంటుకుంటే ప్రమాదం

పెద్దఅంబర్‌పేట, నవంబర్ 27: విద్యుత్ స్తంభాలను తీగల మొక్కలు చుట్టేస్తున్నాయి. కనీసం స్తంభం కనిపించని పరిస్థితి నెలకొంటున్నది. కొన్నిచోట్ల స్తంభాలను పచ్చని తీగలు కమ్మేశాయి. మరికొన్నిచోట్ల పచ్చని తీగలు ఎండిపోయి అల్లుకున్నాయి. ఏదైనా చిన్న మంటలు అంటుకున్నా పెను ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉన్నది. మున్సిపాలిటీలోని పెద్దఅంబర్‌పేట నుంచి కుంట్లూరు వెళ్లే ప్రధాన రహదారితోపాటు తట్టిఅన్నారం నుంచి మర్రిపల్లి మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పదుల సంఖ్యలో స్తంభాలకు ఇలా పచ్చని తీగలు అల్లుకున్నాయి. ప్రమాదాలు చోటుచేసుకోకముందే విద్యుత్‌శాఖ అధికారులు వాటిని తొలగించాల్సిన అవసరం ఉన్నది.

తట్టిఅన్నారం నుంచి మర్రిపల్లి వెళ్లే రోడ్డులో ఇలా..

పెద్దఅంబర్‌పేట నుంచి కుంట్లూరు వెళ్లే మార్గంలో..

విద్యార్థులు విద్యారంగంలో రాణించాలి

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 27 : బాలికలు విద్యా రంగంలో రాణించాలని ఇబ్రహీంపట్నం సీనియర్ సివిల్‌జడ్జి శంకర శ్రీదేవి అన్నారు. ప్రధానమంత్రి బాల్యవివాహ ముక్తభారత్ అనే పిలుపు మేరకు ఇబ్రహీంపట్నం లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో అశ్రిత మహిళా డిగ్రీ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..బాల్య వివాహ చట్టం గురించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. తల్లిదండ్రులు కన్న కలలు నిజం చేయటం కోసం కష్టపడి చదువాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం ఇబ్రహీంపట్నం అధ్యక్షుడు అంజన్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ దనంజయగౌడ్, కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, న్యాయవాద సంఘం ఉపాధ్యక్షుడు రమేశ్, న్యాయవాది శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి శంకర్ శ్రీదేవి

వ్యవసాయ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తాం

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

షాద్‌నగర్, నవంబర్27: ఉమ్మడి కొందుర్గు మండలానికి వ్యవసాయ మార్కెట్‌ను అందుబాటులోకి తేస్తామని, కోల్డ్ స్టోరేజీని నిర్మిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకార్సోవంలో భాగంగా షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ప్రతాప్‌రెడ్డి, బీష్వ కిష్టయ్య, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వర్, నాయకులు యాదయ్యాదవ్, విశ్వం, కె. పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, వెంకటేశ్‌గౌడ్, బాల్‌రాజ్ గౌడ్, సయ్యద్ సాధిక్ అధికారులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేయాలి

పదవులు పొందితే సరిపోదని, నిబద్ధతతో పనిచేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యవసాయ మార్కెట్ పాలకవర్గానికి సూచించారు. అదే విధంగా మార్కెట్ శాఖ అధికారులు మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన, వైస్ చైర్మన్ బాబర్ అలీఖాన్‌లతో పాటు మరో 12 మంది డైరెక్టర్లతో పదవి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పాలక వర్గ సభ్యులను పలువురు నాయకులు, రైతులు, వ్యాపారులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

మొయినాబాద్ : విద్యతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని ఎన్కేపల్లి రెవెన్యూలో ఉన్న శ్రీ స్వామి నారాయణ అంతర్జాతీయ గురుకుల పాఠశాలలో గురుకుల ఒలంపిక్స్-2024 క్రీడోత్సవాలకు మంత్రి ముఖ్యఅతిథిగా విచ్చేసి క్రీడలను ప్రారంభించారు. ఇందులో 108 పాఠశాలల నుంచి 10,130 మంది క్రీడాకారులు పాల్గొనగా, 26 రకాల ఆటలు, వివిధ క్రీడా పోటీలతో ప్రారంభమైంది. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అకట్టుకున్నాయి. గురుకుల ఒలంపిక్స్ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు.

తప్పుల్లేకుండా వివరాలు నమోదు చేయాలి

మున్సిపాలిటీలో డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న డీపీవో సురేశ్ మోహన్

కొత్తూరు, నవంబర్ 27: కులగణన పత్రాల సర్వే పత్రాల వివరాలు తప్పులు లేకుండా నమోదు చేయాలని డీపీవో సురేశ్ సూచించారు. కొత్తూరు మున్సిపల్ కార్యాలయంలో చేపట్టిన డాటా ఎంట్రీని డీపీవో సురేశ్‌మోహన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పకడ్బందీగా డాటా నమోదు చేయాలని సూచించారు. అనంతరం గూడూరు జడ్పీహెచ్ఎస్‌లోని ఉన్న పాంట్రీ క్లాస్‌రూమ్‌ను డీపీవో సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, ఎంపీడీవో అరుంధతి, ఎంపీవో విజయలక్ష్మి, కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

మొయినాబాద్, నవంబర్ 27 : భవన నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వ మౌలిక సదుపాయాలను కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి అన్నారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్ గేట్ వద్ద కార్మికుల అడ్డా వద్ద ఏఐటీయూసీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. 100 మందికి సభ్యత్వాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ రంగ కార్మికులు అడ్డాల వద్ద మంచి నీటి సౌకర్యం కల్పించడంతో పాటు రూ.5లకే భోజనం, మొబైల్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాయకుండా కార్మికుల హక్కులను అమలు చేయాలని సూచించారు. కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, భవన నిర్మాణ రంగం కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశ్, సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు డప్పు శివయ్య, భవన నిర్మాణ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్, సభ్యులు దర్శన్, రాజు, మల్లేశ్, కేశవులు నర్సింహులు, యాదమ్మ, జ్యోతికళ పాల్గొన్నారు.

కార్మికులకు సభ్యత్వం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

అనుమతి లేకుండా నల్లా కనెక్షన్లు.. కేసు నమోదు

శంషాబాద్ రూరల్, నవంబర్ 27 : శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో జలమండలి అనుమతిలేకుండా నల్లా కనెక్షన్లు తీసుకున్న వారిపై కేసులు నమోదు చేశారు. జలమండలి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం .. శంషాబాద్ పట్టణంలోని కుమ్మరిబస్తీ, యాదవ్‌బస్తీ, కాపుగడ్డ ప్రాంతాల్లో నివాసముంటున్న రవి, కృష్ణ, కుమార్, అంజయ్య, మహబూబీ, బాలరాజు, భాస్కర్‌లు అనుమతిలేకుండా నల్లా కనెక్షన్లు పెట్టుకున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు గుర్తించి వారిపై శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్రమ నల్లా కనెక్షన్‌తో పాటు ఎలక్ట్రికల్ మోటర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైన అక్రమ నల్లా కనెక్షన్ తీసుకుంటే వారిపై విజిలెన్స్ అధికారుల బృందానికి ఫోన్: 9989998100,9989987135 లలకు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు.

శంషాబాద్ పట్టణంలో ఒకే ఇంటికి ఉన్న రెండు నల్లా కనెక్షన్లు

ఆయుష్‌ను సందర్శించిన బీఆర్‌కేఆర్ విద్యార్థులు

ఆయుష్ సంస్థను సందర్శించిన బీఆర్‌కేఆర్ ఆయుర్వేద కళాశాల విద్యార్థులు, ఆయుష్ ప్రతినిధులు

సైదాబాద్, నబంబర్ 27 : సైదాబాద్ డివిజన్ గడ్డి అన్నారంలోని ఆయుర్వేద పరంపర సంస్థను బుధవారం డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రథమ సంవత్సర విద్యార్థులు సందర్శించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జ్ఞానేశ్వరి, అసిస్టెంట్ ప్రొఫెసర్ విశ్వనాథన్ పర్యవేక్షణలో ప్రథమ సంవత్సరం ఆయుర్వేద విద్యార్థులు ఆయూష్‌ను పరిశీలించారు. ఆయూష్ సంస్థల పనితీరు, గ్రంథాలయంలోని పురాతన, సంగ్రహాలయంలోని తాళపత్ర గ్రంథాలు, వైద్య చికిత్స, చరిత్రకు సంబంధించిన విషయాలను ఆయూష్ పరిశోధన అధికారి డాక్టర్ శ్రీదేవి, అశ్వాక్ మహ్మద్, వైరముత్తు, మురళీ మనోహర్ వివరించారు.

ముగిసిన ఉచిత కంటి వైద్య శిబిరం

కంటి సర్జరీ చేయించుకున్న వారితో ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, నవంబర్ 27: పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ మాట్లాడుతూ ఇలాంటి ప్రజా సేవ కార్యక్రమాలు చేయడంలో ఫౌండేషన్ ముందుంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శ్రీరాములు, నరేందర్ గౌడ్, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, మల్లయ్య, మల్లేశ్ నాయక్, రమేశ్‌గౌడ్, కొండల్‌యాదవ్, రమేశ్‌నాయక్, కొండల్‌రెడ్డి, రఘు, శివ, యాదయ్య, శేఖర్, శ్రీపతి, రవియాదవ్, అభినవ్, శ్రీను, మహేశ్, మల్లేశ్‌నాయక్, కల్యాణ్, భాస్కర్ ఉన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించండి

పెద్దఅంబర్‌పేట, నవంబర్ 27: మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు రెవెన్యూ 68, 69, 70, 71, 278/1 (భాగం), 278/2, 278/3 సర్వేనంబర్‌లలోకి చొరబడి అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను తొలగించాలని రేణుకా హోమ్స్ ప్రైవేట్ లిమిడెట్ డైరెక్టర్ జీ రాంబాబు యాదవ్ కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎస్ రవీందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కుంట్లూరు రెవెన్యూలో 278/1 (భాగం)లో గతంలో భూదాన్ పట్టాలు ఇచ్చారని, వారు తమ భూభాగంలోకి వచ్చి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని వివరించారు. అక్రమ నిర్మాణాలను తొలగించాలని విన్నవించారు.

కాంగ్రెస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారు..

- హామీలను నెరవేర్చే వరకు నిలదీస్తాం..
- బీఆర్ఎస్ కందుకూరు నాయకులు

కందుకూరు, నవంబర్ 27 : కాంగ్రెస్ పార్టీ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని.. వారు ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదని కందుకూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేయడం తప్పా? అని ప్రశ్నించారు. హామీలను నెరవేర్చే వరకు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి తప్ప.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పైసా అభివృద్ధి జరగలేదని పేర్కొన్నారు. కొందరు నాయకులు సబితా ఇంద్రారెడ్డిని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని, ఆమెను విర్శించే స్థాయి వారికి లేదన్నారు. ఉనికిని కాపాడుకోవడానికి మాట్లాడటం భావ్యం కాదన్నారు. విమర్శలు చేసే ముందు గత చరిత్ర తెలుసుకొని మాట్లాడాలని ఆయన సూచించారు. అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట మాజీ డైరెక్టర్ సామ ప్రకాశ్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సురుసాని సుదర్శన్‌రెడ్డి, లక్ష్మణాచారి పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు సురేందర్‌రెడ్డి తదితరులు

మురుగు పారుతున్నా.. పట్టించుకునే వారేరి?

- ప్రజా సమస్యలు పట్టించుకోని జల్‌పల్లి మున్సిపల్ అధికారులు
- దుర్గంధంతో ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు

పహాడిషరీఫ్, నవంబర్ 27 : వానకాలం పోయినప్పటికీ నేటికీ డ్రైనేజీ మురుగు పారుతూనే ఉన్నది. రోడ్లపై మురుగు నీటి పారుదలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. విషయాన్ని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పక్కన పెట్టేయడంతో నెలల తరబడిగా స్థానికులు ఆ దారిలో ముక్కుమూసుకుని వెళ్తూనే ఉన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు హనుమాన్ దేవాలయ ప్రాంతంలో రోడ్డుపై నిత్యం మురుగు పారడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్ల ముందు చేరి నిలిచిపోతున్నది. డ్రైనేజీ వ్యవస్థ లోపభూయిష్టంగా ఏర్పాటు చేయడంతో లోతట్టు ప్రాంత వాసులకు ఇది శాపంగా మారింది. ఫలితంగా ఆ ప్రాంతంలో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తుండటంతో స్థానికులకు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ రోడ్డుపై పలువురు మహిళలు జారిపడి గాయాల పాలయ్యారు.

కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం..

ఈ విషయమై స్థానికులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న పాపాన పోవడంలేదని పలువురు మండిపడుతున్నారు. నెలల తరబడి మురుగు నీటితో ఇబ్బంది పడుతున్నా ఇంజినీరింగ్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌కు సైతం ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యను పరిష్కరించడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్లపై మురుగు చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

16వ వార్డులో ఇండ్ల మధ్య నిలిచిపోయిన మురుగు నీరు

తక్షణమే రహదారుల నిర్మాణ పనులు చేపట్టండి

నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

మణికొండ, నవంబర్ 27 : పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రహదారుల విస్తరణతో పాటు నిర్మాణాల కోసం ప్రత్యేకంగా నిధులను వెచ్చిస్తూ అభివృద్ధి పనులను చేపడుతున్నామని నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మిర్జాగూడ, మేకన్‌గడ్డ, ఖానాపూర్ గ్రామాల్లో ఇంజినీరింగ్‌శాఖ డీఈ నరేశ్‌కుమార్, ఏఈ శ్రీనివాస్‌లతో కలిసి ఆయన రహదారులను పరిశీలించారు. రహదారులు ఇరుకుగా ఉండటంతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి అవసరమైన నిధులను వెచ్చించాలని కోరారు. అపరిష్కృతంగా ఉన్న రహదారులను పరిశీలించి ..ముందుగా మంజూరైన నిధులతో తక్షణమే రహదారుల నిర్మాణ పనులను మొదలు పెట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రహదారుల నిర్మాణాల్లో నాణ్యతాప్రమాణాలు లోపించకుండా నిబంధనల ప్రకారం నిర్మాణాలు జరగాలన్నారు. ఖానాపూర్ గ్రామ ప్రధాన చౌరస్తా నుంచి గ్రామ చివరి వరకు దాదాపు రూ.కోటి నిధులతో పనులను మొదలు పెట్టేందుకు చర్యలు చేపట్టనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ నరేశ్‌కుమార్, ఏఈ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మల్లేశ్, స్థానికులు పాల్గొన్నారు.

ఖానాపూర్ ప్రధాన రహదారి విస్తరణపై ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలిస్తున్న నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలి

కొత్తూరు, నవంబర్ 27: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశం అన్నారు. మండల పరిధిలోని కస్తూశాంతివనంలోని హార్ట్‌ఫుల్‌నెస్ లర్నింగ్ సెంటర్ పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు ఆటల్లోనూ విద్యార్థులు రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతి కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ముఖ్యంగా సాంస్కృతి కార్యక్రమాలు దేశ సంస్కృతిని ప్రతిబింబించేలా ఉన్నాయి.